క్లుప్తంగా

ఎస్‌డీపీఐ ఆవిర్భావ దినోత్సవం



రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల (వ్యవసాయం): సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) 17వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నంద్యాల అసెంబ్లీ అధ్యక్షుడు హనీఫ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముందుగా పార్టీ పతాకాన్ని స్థానిక కార్యలయం వద్ద ఎగుర వేశారు. అనంతరం గాంధీ చౌక్‌లో రక్తదాన శిబిరం ప్రారంభించారు. నాయకులు సుల్తాన్, అమీర్ ముల్లా, అబ్దుల్ కలాం, సమీఉల్లా,కరిముల్లా పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శిరివెళ్ల: రహదారి నిబంధనలు పాటించి ప్రమాదల నివారణకు సహకరించాలని సీఐ దస్తగిరి బాబు సూచించారు. శనివారం శిరివెళ్ల మెట్ట వద్ద వాహనదారులకు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఓవర్‌లోడ్, అతివేగం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. లైసెన్స్, వాహనపత్రాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్న పీరయ్య పాల్గొన్నారు.

మల్లన్నకు నృత్య నీరాజనం



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై హైదరాబాద్‌కు చెందిన అక్షయ నృత్యాలయ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వినాయకకౌత్వం, ఓం నమశివాయ, భో శంభో, శివతాండవం తదితర గీతాలకు అవని సతీష్, అపర్ణ, సుప్రీతి, అమూల్య తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

రైల్వేలైన్ భూసేకరణకు సహకరించాలి



ఆర్‌డీఓ నరసింహులుతో మాట్లాడుతున్న రైతులు

బనగానపల్లె రూరల్: మండలంలోని జయజ్యోతి సిమెంట్ పరిశ్రమ కోసం రైల్వేలైన్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణకు రైతులు సహకరించాలని ఆర్‌డీఓ నరసింహులు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బత్తులురుపాడు, యనకండ్ల గ్రామాలకు చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం ఇచ్చే ధర తమకు గిట్టుబాటు కాదని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎకరం రూ.60–80లక్షలు పలుకుతోందని పేర్కొన్నారు. గిట్టుబాటు ధర ఇస్తేను రైల్వేలైన్ ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. తహసీల్దార్ నారాయణరెడ్డి, వీఆర్‌ఓ ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఒడిశా వాసి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ఒడిశా వాసి

కర్నూలు: ఉపాధి నిమిత్తం వలస వచ్చి కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నివాసముంటున్న ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్ గ్రామానికి చెందిన సుశాంత్ కుమార్ దాలియా (36) చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన స్థానిక జీఎస్ ప్లాస్టిక్ రీ సైక్లింగ్ ఫ్యాక్టరీలో నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. ఒంటరిగా ఉంటున్న ఈయన శుక్రవారం రాత్రి భార్య మున్నీకి ఫోన్ చేశాడు. మాటల సందర్భంలో ఆమెతో గొడవ పడి క్షణికావేశంలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతుండగా ఫ్యాక్టరీ మేనేజర్ ప్రదీప్ చుట్టు పక్కల వారి సహాయంతో ఉరి నుంచి తప్పించి వైద్యచికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీ కేంద్రంలో భద్రపరచి మృతి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు చేరవేశారు.

నేడు సంగీత విభావరి

కర్నూలు కల్చరల్: గాన గంధర్వ పద్మ భూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 80వ జయంతిని పురస్కరించుకొని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన గాయకులు బాలకోటేశ్వరరావు, హనుమంతరావు, రాధిక, కర్నూలు గాయని ప్రియాంకలు సంగీత విభావరిలో ఎస్పీ బాలు పాడిన పాటలను గానం చేస్తారని పేర్కొన్నారు.

ఉత్పత్తిదారులు సంఘాలుగా ఏర్పడాలి

- జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు

సాక్షి ఎఫెక్ట్



చిన్నవంగలిలో ఉద్యాన రైతులతో సమావేశం నిర్వహిస్తున్న ఉద్యానశాఖాధికారులు

ఆళ్లగడ్డ: ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు సంఘాలుగా ఏర్పడితే నేరుగా మార్కెట్ వారితో అనుసంధానం చేసుకోవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు సూచించారు. జిల్లాలో దళారి వ్యవస్థ.. ఉద్యాన పంటల మార్కెట్‌ను శాసిస్తోందనే విషయాన్ని 'సాక్షి' శుక్రవారం 'దళారుల పంట పండుతోంది' శీర్షికన ప్రచురించిన కథనానికి జిల్లా ఉద్యానశాఖాధికారులు స్పందించారు. శనివారం చాగలమర్రి మండలంలోని పలుగ్రామాల్లో సంచరించి రైతులతో మమేకమయ్యారు. అనంతరం చిన్నవంగళి గ్రామంలో ఉద్యాన పంటల సాగుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో దళారి వ్యవస్థ, మార్కెంటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే గ్రామం కాని, రెండు మూడు గ్రామాల్లోని రైతులు కానీ కలిసి ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడేందుకు ముందుకు రావాలన్నారు. తద్వారా రైతులే నేరుగా మార్కెట్ వారితో మాట్లాడుకుంటూ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా దళారీ వ్యవస్థను పూర్తిగా అడ్డుకోవచ్చన్నారు. ఈ సంఘాలకు గోడౌన్ లను నిర్మించుకునేందుకు రాయితీ సౌకర్యంకూడా పొందవచ్చన్నారు. అక్కడే గ్రేడింగ్ చేసుకొని, నిల్వ చేసుకోవచ్చన్నారు. ధర లేనప్పుడు కొన్ని రకాల ఉత్పత్తులను పౌడర్ చేయడం, జూస్‌గా చేయడం, డ్రై చేసేందుకు అవసరమైన స్టీం చేయడం తదితర ఉప ఉత్పత్తులను తయారు చేసుకునే విధంగా అవసరమైన యంత్రాలను సబ్సిడీపై అందజేయనున్నట్లు చెప్పారు. ఈయన వెంట ఉద్యానశాఖ అధికారులు శ్రీధర్, దస్తగిరి ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



నంద్యాలలో ప్రజలకు రోడ్డు భద్రత నియమాలు వివరిస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం : ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్టేషన్ల పరి ధిలో ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్‌మె ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తలిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. స్కూల్ పిల్లలను పరిమితికి మించి ఆటోల్లో తీసుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరైన ధృవపత్రాలు లేకుండా వాహనం నడిపినా, మద్యం సేవించి నడిపినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

కూలీల సమస్యలను పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, భాస్కర్, హరినాథ్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23వ తేదీన ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధి హామీ కూలీలకు వేతనాలు అందజేయాలని కోరారు. ఉపాధి కూలీలకు పనులు చేసే చోట సరైన సౌకర్యాలు లేవని మండిపడ్డారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పాల్గొంటారని చెప్పారు.

'యువత పోరు'ను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

బొమ్మలసత్రం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 23వ తేదిన నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్ పిలుపురిచ్చారు. శనివారం స్థానిక మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక యూటర్న్ తీసుకున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు చేసిన మోసాన్ని ఎండగడుతూ సోమవారం యువత పోరులో భాగంగా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. అనంతరం యువత పోరు పోస్టర్లు ఆవిష్కరించారు.

యోగా కోసం గిరిజన విద్యార్థులకు ఇబ్బందులు

నంద్యాల(న్యూటౌన్): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గిన్నిస్ రికార్డు కోసం గిరిజన పిల్లలను 26 వేలకు పైగా తరలించారని, దీంతో వారు ఇబ్బందులు పడ్డారని, సంక్షేమ హాస్టళ్లలో హెల్త్ వర్కర్లను నియమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మోదీ మెప్పు కోసం, గిన్నిస్ రికార్డుల కోసం వేల మంది గిరిజన విద్యార్థులను ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టల్ నుంచియోగాంధ్ర కార్యక్రమానికి అర్ధరాత్రి 2గంటలకు బస్సులో తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు నిద్రించడానికి సరైన సదుపాయాలు కూడా ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడితే ఆసుపత్రులకు తరలించడానికి హెల్త్ వర్కర్లు, అంబులెన్స్‌లు ఉండవు కానీ..యోగాంధ్రకు మాత్రమే ప్రత్యేకమైన బస్సులను ఏర్పాటు చేస్తారా అని ప్రశ్నించారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి



గుంటూరు డీఆర్‌ఎంకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఉమ్మడి కర్నూలు జిల్లాలో నెలకొన్ని రైల్వే సమస్యలను పరిష్కరించాలని గుంటూరు రైల్వే డివిజన్ మేనేజర్ సుధీష్టసేనాకు విశ్వ హిందూ పరిషత్ నాయకులు శనివారం స్థానిక రైల్వే కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గాజులపల్లె రైల్వే స్టేషన్ పేరును మహానంది రైల్వేస్టేషన్ మార్చాలని, నంద్యాల–రేణిగుంట కర్నూలు డెమో ప్యాసింజర్ ట్రైన్లలో టాయిలెట్ ఏర్పాటు చేయాలని, నంద్యాల–రేణిగుంట సమయాలు మార్చాలని కోరారు. అలాగే..తిరుపతి రూట్‌లో కొత్త ప్యాసింజర్ రైలు, ఇంటర్ సిటీ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. నంద్యాల గుంతకల్, ఆదోని, మంత్రాలయం, రాయచూర్ వరకు ఇంటర్‌సిటీ ట్రైన్‌ను.. నంద్యాల, డోన్ కర్నూలు ట్రైన్, గుంతకల్, ఆదోని, మంత్రాలయం, రాయచూర్ వరకు రూట్ మార్చాలని విజ్ఞప్తి చేశారు. వీహెచ్‌పీ నాయకులు జనపాల నాగరాజు, లింగేశ్వరరావు, చంద్రశేఖర్, మోహన్, కిరణ్, గాంధీరెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(వ్యవసాయం): ఈ నెల 26వ తేదీన నిర్వహించే దివ్యంగుల ఉపకారణాల ప్రత్యేక వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. 26న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మున్సిపల్ టౌన్‌హాల్‌లో దివ్యాంగులు, వృద్ధులను పరీక్షించి వారికి అవసరమైన వారికి బ్యాటరీతో నడిచే మూడు చక్రాల సైకిళ్లు, చక్రాల కుర్చీలు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు, అంధుల చేతి కర్రలు ఉచితంగా అందించడానికి ఎంపిక చేస్తారన్నారు. సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, వికలత్వం కనిపించే ఫోటోలు మూడు, స్వావలంబన కార్డులు తీసుకురావాలని సూచించారు.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు



వ్యాపారులకు సూచనలిస్తున్న ఈఓ ఎన్.శ్రీనివాసరెడ్డి

మహానంది: ఆలయ పరిధిలో షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులు వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. శనివారం దేవస్థానం కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు భక్తుల నుంచి ఫిర్యాదులొస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ కప్పులు, ఫైబర్ కప్పులు వాడరాదని, గాజు గ్లాసులు మాత్రమే వాడాలన్నారు. షాపుల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, ధరల వివరాల బోర్డులను మూడు రోజుల్లోపు ఏర్పాటు చేయకపోతే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. ప్రతి నెలా కార్యాలయం వద్దకు వచ్చి అద్దెలు చెల్లించాలన్నారు. సమావేశంలో ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్ నీలకంఠరాజు పాల్గొన్నారు.

ఎన్నో ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

కోవెలకుంట్ల: ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఆ సమితి జాతీయ అధ్యక్షుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ మున్నంగి నాగరాజు అన్నారు. శనివారం కోవెలకుంట్ల రోటరీ క్లబ్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్, వీహెచ్‌పీఎస్, మహిళ అనుబంధ సంఘాల గ్రామ స్థాయి కమిటీల సంస్థాగత నిర్మాణం, సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపై ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జులై 7వ తేదీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. గ్రామాల్లో మాదిగల ఆత్మగౌరవ జెండాలను ఆవిష్కరించాలని సూచించారు. సమితి జిల్లా అధ్యక్షుడు కత్తి ఓబులేసు, నాయకులు అప్పపోగు వెంకటసుబ్బయ్య, రాజు, నాగేశ్వరరావు, పెద్దమునెయ్య, విజయ్ పాల్గొన్నారు.

పోలీసు లాంఛనాలతో హెచ్‌సీ అంత్యక్రియలు



హెడ్ కానిస్టేబుల్ మృతదేహానికి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు : మూర్చ వ్యాధికి గురై కొన్ని నెలలుగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందిన ఆత్మకూరు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు భౌతిక కాయానికి శనివారం కల్లూరు శ్మశాన వాటికలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మిడుతూరు ఎస్ఐ ఓబులేసు, పోలీసు అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగరాజుతో పాటు కుటుంబ సభ్యులు, సహోద్యోగులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉంటే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు కళ్లను కుమారుడు సందీప్, కుటుంబ సభ్యులు మూర్తి కలిసి కర్నూలు ఐ–బ్యాంక్‌కు దానం చేశారు. టెక్నీషియన్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

జిమ్ పరికరాల అందజేత

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలోని పెద్ద చెరువు కట్టపై వాకర్స్‌కు అవసరమైన జిమ్ పరికరాలను రోటరీ సభ్యుడు కూరగాయల ప్రసాద్ శనివారం రోటరీ క్లబ్ సభ్యులకు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎన్‌సీ మోహన్‌రెడ్డి, కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ వాకర్స్‌కు అవసరమైన రూ.15వేల విలువజేసే జిమ్ పరికరాలను అందజేశారని చెప్పారు.

దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేద్దాం

ఆత్మకూరు: జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహ నాయక్, స్వాములు కోరారు. శనివారం సమ్మెకు సంబంధించిన స్టిక్కర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కేంద్రం ప్రభుత్వం నీరుగార్చడం తగదన్నారు. పారిశ్రామికవేత్తలకు కార్మికులను కట్టుబానిసల్లా చేయడమే బీజేపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాబాషా, రామ్ నాయక్, అలక్కీరాజు తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలపై దాడులు



విత్తన దుకాణ యజమానితో వివరాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారి ప్రసాదరావు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని విత్తన దుకాణాలపై వ్యవసాయాధికారులు శనివారం దాడులు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో పలు విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్స్, తదితరాలను పరిశీలించారు. అలాగే హెచ్‌టీ కాటన్ స్ట్రిప్ టెస్టు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అనుమతులు పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విత్తనాలు విక్రయించరాదని, విత్తనం కొన్న ప్రతి రైతుకు బిల్లు ఇవ్వాలని దుకాణాల యజమానులను ఆదేశించారు. నిబంధనలు పాటించని విత్తన డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఈఓ మహేష్ ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



మార్కెట్‌యార్డు ఆవరణలో చెత్తను సేకరిస్తున్న కలెక్టర్, జేసీ

నంద్యాల(అర్బన్): ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని మన ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డు ప్రాంగణంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం అనంతరం స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మార్కెట్ యార్డ్ లోని పిచ్చి మొక్కలు, చెత్త చదరాన్ని తొలగించి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న తర్వాత 'క్లీన్ మైండ్ క్లీన్ బాడీ' అనే థీమ్‌తో పాటు రెగ్యులర్ థీమ్ అయిన నీరు–మీరు కింద కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 వేల ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు చేపట్టారని, ఆయా ప్రదేశాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నియామకాలు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న శివయ్య

నంద్యాల(న్యూటౌన్): బదిలీలు, పదోన్నతులు చేపట్టడం వల్ల చాలా మండలాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని, దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని త్వరగా డీఎస్సీ నియామకాలు త్వరగా పూర్తి చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, కేవీ శివయ్య కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు జీతాల సమస్య లేకుండా కేడర్ స్ట్రెంత్, పొజిషన్ ఐడీని త్వరగా కేటాయించాలన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమైన పది రోజులకే లీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాలు చేపట్టడం సబబు కాదన్నారు. పాఠశాలలు ప్రారంభమైన రోజు నుంచి యాప్‌ల పనిభారం పెరగడం తప్ప తగ్గించ లేదన్నారు. అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌లో జోడించి యాప్‌లను తగ్గించినట్లు ప్రభుత్వం మాయచేస్తుందన్నారు. బోధన ప్రభావంతంగా సాగాలంటే యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు.నాయకులు జాకీర్‌హుసేన్, సుబ్బారెడ్డి, బాషా, పుల్లయ్య, వీరేశ్వరరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించొద్దు



ఆటో డ్రైవర్లు, ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నగీన

ఆళ్లగడ్డ: ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నగీన హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌పై వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. మద్యం, మత్తు పదార్థాలు తాగి వాహనాలు నడపరాదన్నారు. ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించవద్దని, వారితో మర్యాదగా మెలగాలని, అతి వేగంతో నడపొద్దని, ఎక్కడ పడితే అక్కడ ఆపొద్దని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఆకతాయిలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఆటోలను కట్టడి చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మొక్కలే ప్రాణకోటికి జీవనాధారం



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉయ్యాలవాడ: మానవాళి మనుగడకు చెట్లు జీవనాధారమని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. శనివారం స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మోడల్‌స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రకృతి సహితంగా జీవిస్తే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని ఇందుకోసం పరిసరాలను పచ్చదనంగా మార్చుకోవాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జెడ్పీటీసీ సభ్యులు కసాని పుణ్యలక్ష్మిదేవి, మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ, ఎంఈఓ రఘురామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు విజయకుమార్, తహసీల్దార్ సువర్ణాదేవి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తదితరులు పిచ్చి మొక్కలను తొలగించారు.

పాచిపట్టిన నిర్లక్ష్యం



పాచి పట్టిన మినీ ట్యాంక్

పగిడ్యాల: పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి ట్యాంక్ పాచి పట్టింది. పదిహేను రోజులకోసారి ట్యాంక్‌లను శుభ్రం చేయడంతో పాటు ప్రతి ఫిల్లింగ్‌ను క్లోరినేషన్ చేయాలనే నిబంధనలు పేపర్లకే పరిమితం అయ్యాయి. అందుకు నిలువెత్తు సాక్ష్యమే పడమర ప్రాతకోటలోని మినీ ట్యాంక్. ట్యాంక్‌లు లీకేజీ అవుతూ పాచిపట్టిన నీటితే ప్రజలు తాగుతున్నా పట్టించుకునే నాథుడు లేరు. ఇకనైనా మండల అధికారులు స్పందించి ట్యాంక్‌లను శుభ్రం చేయించడంతో పాటు నీటిని క్లోరినేషన్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంటీఎస్ టీచర్లకు నేడు కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో మినిమం టైం స్కేల్(ఎంటీఎస్)పై పని చేస్తున్న 1998, 2008 డీఎస్సీ ఎస్‌జీటీలకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ ఎస్. శామ్యూల్ పాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష కార్యాలయం సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఎంటీఎస్ టీచర్ల జాబితాలను డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టామని డీఈఓ పేర్కొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఆళ్లగడ్డ కోర్టు ఆవరణలో యోగా చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



ఉయ్యాలవాడలో శవాసనం వేస్తున్న దృశ్యం



ఆసనం వేస్తున్న ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్ విద్యార్థి

ఆళ్లగడ్డ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు శైలజ, భాస్కర్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆళ్లగడ్డ కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ భారతీయ యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఉయ్యాలవాడ/శిరివెళ్ల/రుద్రవరం/దొర్నిపాడు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఘనంగా నిర్వహించారు. మోడల్‌స్కూల్ విద్యార్థి శ్రీధర్ వేసిన ఆసనాలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో జిల్లా ఇందిరాకాంతి పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే శిరివెళ్లలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ బాలస్వామి, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, తహసీల్దారు మల్లికార్జునరావు యోగాసనాలు వేశారు. దొర్నిపాడులో నిర్వహించిన యోగా కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి గోవిందనాయక్, ఎంపీడీఓ సావిత్రి, పశువైద్యాధికారి చిన్నబాబు పాల్గొన్నారు.